

కథా కౌముది

# చేయూత

– శారద మురళి, క్వీన్స్ లాండ్, ఆస్ట్రేలియా

**శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**23 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**ఉత్తమ కథానిక విభాగం విజేత**

**ఇంటి ముందు** కారాపి, కార్లోంచి దిగింది పద్మ. డిక్కీలోంచి సామానంతా తీసుకొని గుమ్మం తలుపు తట్టింది. లోపల్నుంచి పెద్దగా గొంతులు వినిపిస్తున్నాయి. మైఖెల్ ఇంటికొచ్చినట్టున్నాడు, అనుకొని నిట్టూర్చింది.

తలుపు భళ్ళున తెరిచాడు మైఖెల్.

"నువ్వా? ఎందుకొచ్చావ్?" కొట్టినట్టే అన్నాడు. గుమ్మం నిండా పొడుగ్గా, లావుగా, ఒళ్ళంతా విచిత్రమైన పచ్చబొట్లతో, నోరెత్తితే ధారాళంగా బయటికొచ్చే బూతు మాటలతో, మొరటుగా క్రూరంగా వున్నాడు మైఖెల్. ఒక్క క్షణం గుండె దడ దడాలాడిందామెకు. కానీ ఆ మొరటు తనమూ క్రూరత్వమూ పై పై పటారాలేననీ, లోపలతను పసిబిడ్డకంటే హీనంగా భయపడతాడనీ తెలిసే వుండడం వల్ల, అతన్ని తప్పించుకొని లోపలికొస్తూ, "జెన్నీ యేది? జెన్నీ కోసం వచ్చా, ఇంకా స్కూలు నించి రాలేదా?" అంది.

"చూడు! నువ్వూ, నీ జాలీ, నువ్వు తెచ్చి పడేసే ఈ తిండీ, నీ సహాయమూ, ఏదీ మాకక్కర్లేదని ఎంత చెప్పినా అర్థం కాదా? మేం బిచ్చగాళ్ళం కాదు. మా సంగతి మేము చూసుకోగలము, నువ్వు నెలనెలా మా యింటికి రానక్కర్లేదు," అతని మాటల్ని పట్టించుకోకుండా సంచీలోంచి కొన్ని పాలూ పళ్ళూ, బ్రెడ్డూ తీసి ఫ్రిజ్జులో సర్దసాగిందామె.

"నేనిక్కడున్నా పాట్! నీకోసమే ఎదురు చూస్తున్నా!" లోపల్నించి జెన్నీ కేక వినిపించింది."పద్మ" అనడానికి కష్టంగా వుందని అందరికీ తన పేరు "పాట్" అని చెప్తుంది పద్మ.

"హల్లో జెన్నీ! ఇదిగో నువ్వడిగిన పుస్తకాలు. కిందటి వారం చెప్పిన లెక్కలు చేసావా? పరీక్షలు బాగా దగ్గరకొస్తున్నాయి, ఇంతకీ మీ అమ్మేది?”

"ఇవాళ అమ్మ కొంచెం ఆలస్యంగా వొస్తుంది. మనం చదువుకుందామా?" హై స్కూల్లో పన్నెండో తరగతి చదువుతూన్న జెన్నీ తలెత్తి అడిగింది.

కొంచెం సేపు వాళ్ళ ప్రపంచంలోకి వాళ్ళెళ్ళి పోయారు.

"హలో మిసెస్ పాట్, వచ్చి చాలాసేపైందా? కొంచెం కాఫీ పట్టుకురానా?" గంట తరవాత లోపలికొస్తూ అంది కే, జెన్నీ, మైఖెల్ ల తల్లి. అప్పుడే సామానేదో కొనుక్కొచ్చినట్టుంది, ఆయాసంతో వగరుస్తూంది.

"నేనొచ్చి గంటవుతూంది కే! పద ఇద్దరం కలిసి టీ పెట్టుకొని తాగుదాం. జెన్నీ, ఏదైనా అర్థం కాకపోతే నన్ను పిలువు."

ఇద్దరూ వంటింట్లోకెళ్ళారు.

"మైఖెల్ ఎప్పుడొచ్చాడు? నేనొచ్చేసరికి జెన్నీ మీద అరుస్తున్నాడు,"గుసగుసగా అంది పద్మ.

నిట్టూర్చింది కే!

"వాడి పద్ధతి నకేమీ అర్థం కావడంలేదు పాట్. చదువు వొద్దంటాడు. వుద్యోగం చేయనంటాడు. పొద్దస్తమానం కుర్చీలో కూర్చుని ప్రపంచాన్ని తిట్టిపోసి ఏం ప్రయోజనం? పైగా ఈ మధ్య జెన్నీని చదవొద్దని దెబ్బలాటలు. తెల్లవాళ్ళు నడిపే బళ్ళల్లో తెల్లవాళ్ళ చదువే వుంటుంది, అది మనకవసరం లేదట! రోజూ పోట్లాటలే. ఈ వాతావరణంలో ఆ పిల్ల ఏం చదువుతుందో, ఏం పరీక్షలు రాస్తుందో! ఎలాగైనా ఆ పరీక్షలైపోయి అది ఆ నర్సింగ్ కోర్సేదో వుందట కదా, అందులో చేరిపోతే, ఇక మెల్లిగా దాని బ్రతుకది బ్రతుకుంది. నాది చిన్న వుద్యోగమే అయినా, మా ఇద్దరికింత తిండి పెట్టలేకపోదు. కానీ వాడి వాలకం చూస్తూంటే పరీక్షలు రాయనిస్తాడో లేదో అని భయం పట్టుకుంది. ఈ మూడు నెలలూ ఎలా గడుస్తాయో ఏమో!" మెల్లిగా అటూ ఇటూ నడుస్తూనే మాట్లాడుతుంది కే.

"చూద్దాం కే. భయపడకు, అంతా మంచే జరుగుతుంది లే. నేనొకసారి మైఖెల్ తో మాట్లాడతా. మరీ అంత కష్టమైతే జెన్నీని పరీక్షలప్పుడు మా ఇంట్లో వుంచుకుంటాలే!" అప్రయత్నంగా అనేసింది పద్మ.

నిజంగానా? మీ ఇంట్లో నాలుగు రోజులు జెన్నీ వుంటే నీకేం ఇబ్బంది కాదు కదా? మీ హజ్బెండ్ ఒప్పుకుంటారా?" తమని చూడగానే చిరాగ్గా మొహం చిట్లించే కృష్ణని గుర్తు చేసుకుంటూ అంది కే.

ఏదో మాటవరసకి అన్నదే కానీ, ఆ ఒక్క మాటకే కే పడ్డ సంతోషం చూసి భయం వేసింది పద్మకి. కానీ ఆ విషయం గురించి పెద్దగా ఆలోచించడం ఇష్టం లేక వొదిలేసింది, అక్కడి దాకా వొస్తే చూద్దాం లే అన్నట్టు.

"ఆ పరిస్థితి వొచ్చినప్పుడు చూద్దాంలే! ఇప్పుడు టీ తాగుదాం పద."

ఇద్దరూ బయట పోర్టికోలో కూర్చున్నారు. ఆగస్టు నెల చివరి వారం కావడంతో చలి కొంచెం తగ్గు మొఖం పట్టి వెచ్చని యెండ ఆవరణంతా పరచుకొని వుంది. చాలా మంది ఎబొరిజీన్ల ఇళ్ళలా కాకుండ కే ఇల్లూ వాకిలీ శుభ్రంగా పెట్టుకుంటుంది. చిన్న వుద్యోగంతో ఎలాగైనా కూతుర్ని చదివించుకుంటూ కష్టపడుతూ నిరంతరం పోరాటం చేస్తున్న యోధునిలాగుంటుంది కే.

"ఇక నే బయల్దేరతా కే! ఈ మర్రే బ్రిడ్జి నించి మా ఇంటికి చేరేసరికి గంటైనా పడుతుది. పైగా ఈ టైములో ట్రాఫిక్ తట్టుకోలేం. వొస్తా జెన్నీ! ఆ పుస్తకాలు జాగ్రత్త. అవన్నీ లైబ్రరీవి. మైఖెల్, నువ్వు రేప్పొద్దున్న ఒకసారి వెల్ఫేర్ సెంటర్ కి రారాదూ? రాబర్ట్ తో మాట్లాడుదువుగాని," సంచి భుజానికి తగిలించుకుంటూ అంది పద్మ.

అవునూ కాదూల మధ్య తలాడించాడు మైఖెల్, మొఖం మాడ్చుకుని.

"అసలు నువ్వా వెల్ఫేర్ సెంటర్ లో దరిద్రపుద్యోగం మానేయి పద్మా! నువ్వు వాళ్ళ ఇళ్ళల్లో కెళ్ళినప్పుడల్లా నా గుండెలు పీచు పీచుమంటాయి," చిరాగ్గా అన్నాడు కృష్ణ. ఎప్పట్లాగే నవ్వేసి వూరుకుంది పద్మ.

వాళ్ళు చూడడానికి మొరటు వాళ్ళలాగా,చదువూ సంస్కారం లేని వాళ్ళలా కనిపించినా, వళ్ళంత దుర్మార్గులేమీ కారనీ, జీవితం చేతిలో చావుదెబ్బలు తిన్న వాళ్ళ మీద కొంచెం సానుభూతీ, ఓపికా చూపించాలనీ అతనితో చెప్పి చెప్పి అలిసిపోయిందామె.

మనుషుల మీద జాలి వుంటే కొంచెం డబ్బు వాళ్ళ మొహాన పడేస్తే సరిపోతుందిగా, మరీ వాళ్ళని చంకనెక్కించుకోవాలా, అని ఆశ్చర్యపడే వాళ్ళందరిలాటి వాడే కృష్ణ కూడా. ఈ వాదన గత అయిదేళ్ళుగా జరుగుతూనే వుంది. అయిదేళ్ళ క్రితం పద్మ అబొరిజీన్ వెల్ఫేర్ సెంటర్ లో ముందు వాలంటీరుగా చేరి, తరవాత పర్మనెంటు ఉద్యోగం సంపాదించుకుంది.

"ఏమిటీ? అబొరిజీన్ వెల్ఫేర్ సెంటర్ లో వాలంటీరుగా చేరతావా? వూరికే వున్న ప్రాణానికి ఇప్పుడదంత అవసరమా?" కృష్ణ తో పాటు ఆమె మిగతా స్నేహితులు కూడా అదే మాటన్నారు.

"ఎందుకు పద్మా ఆ ప్రయాస? నువ్వసలే సున్నితమన్స్కురాలివి. వాళ్ళ జీవితాలని దగ్గర్నించి చూసి తట్టుకోగలవా", కృష్ణ చాలా నిరుత్సాహపరచాడు రకరకాలుగా.

అతనన్న మాటా నిజమే అయినా, ఎందుకో వాళ్ళకి సాయం చేయాలని ఆశగా అనిపించింది ఆమెకి.

మొదటిసారి యూనివర్సిటీ కెళ్ళే దారిలో గుంపులు గుంపులుగా దిగులుగా వెనక వెనక కూర్చొని వుండే వాళ్ళని చూసి విచిత్రంగా అనిపించింది.

బసుస్టాపులో ఒకరోజు ఒక ఇరవై యేళ్ళ అబోరిజీన్ కుర్రవాడు దీనంగా దగ్గరికొచ్చి, "వుడ్ యూ హేవ్ ఎ డాలర్ టు గివ్ మి?" అన్నాడు. మనసంతా కలచి నట్లయి వాడి చేతిలో కొంచెం చిల్లర వేసింది. అక్కడే ఆగివున్న బస్సులోంచి ఇదంతా చూస్తున్న డ్రైవరు బస్సు దిగొచ్చి,

"మేడం, మీలాటి అమాయకులు వాళ్ళకి డబ్బిస్తే, దానితో తాగి తందనాలాడతారు. మళ్ళీ వాళ్ళ బాగోగులకోసం మనమిచ్చే టాక్సులతోనే వెల్ఫేర్ సెంటర్ నడుపుతుంది ప్రభుత్వం. మన లాంటి వాళ్ళు కష్టపడి సంపాదిస్తుంటే వీళ్ళ తాగుడుకి ప్రభుత్వం సబ్సిడీలిస్తుంది," వెటకారంగా అన్నాడు.

బిత్తరపోయింది తను. ఒక రకంగా ఆలోచిస్తే ఆ డ్రైవరు మాటలతో కొత్త ఆలోచనలొచ్చాయి తనకి. నిజమే, వాళ్ళకి కావలసింది బిచ్చం కాదు. బ్రతుకు మీద నమ్మకం కలిగించే ధైర్యం.

అప్పుడే నగరంలో వెల్ఫేర్ సెంటర్ల గురించి ఆరా తీసి వాలంటీరు గా పనిచేయడానికి అనుమతి కోసం దరఖాస్తు చేసింది.

పోలీసు క్లియరెన్సులూ ఇంకా రక రకాల సర్టిఫికేట్లూ సంపాదించి చివరకి అనుకున్నట్టుగా వెల్ఫేర్ సెంటర్లో చేరింది.

మొదట్లో అక్కడ కొంచెం బెరుగ్గా భయంగా వుండేది. అందులోనూ తనకి ఇంగ్లీషు అంత బాగా రాదన్న న్యూనతా భావమూ వుండేది. దానికి తోడు తన వాలంటీర్ కో–ఆర్డినేటర్ కి తనని చూస్తే వేళాకోళంగా వుండేది. "ఆ, మళ్ళీ నువ్వొచ్చినపుడు చూద్దాం లే, " అన్న తేలికైన భావంతో తనకే బాధ్యతా అప్పగించేవాడు కాదు. వరసగా నాలుగైదు వారాలు తను వెళ్ళినా ఆశ్చర్యపోయాడే తప్ప పెద్ద నమ్మకం పెంచుకోలేదు.

అలాటి రోజుల్లో ఒకసారి కే అతనితో గొడవపడుతూంటే చూసింది తను. రెండు మూడు సార్లు చూసిన తరవాత అడిగింది రాబర్ట్ ని, సంగతేమిటని. కే కి ఒక చిన్న కూతురుందనీ, చదువుకోవాలని ఆశపడుతూందనీ, అయితే వాళ్ళుండే మారు మూల గ్రామం లో కాస్తా సాయం చేసే ట్యూటరు కోసం వెతుకుందనీ అర్థమయింది.

రాబర్ట్ పెద్ద పట్టించుకోవటంలేదు. "ఎవరికి టైముంటుంది ఇప్పుడు మర్రే బ్రిడ్జి కి వెళ్ళి చదువుచెప్పడానికి!" అన్నాడు నిరాసక్తంగా.

"నేను వేళతా రాబర్ట్," అంది తను.

"వెళ్ళొచ్చు, కానీ, బాగా ఆలోచించుకోండి. అడిలైడ్ నించి గంట పైగా ప్రయాణం! వాళ్ళ ఇళ్ళూ వాతావరణమూ మీరనుకున్నట్టుగా వుండదు," రాబర్ట్ మెత్తగా మందలిస్తే,

మిగతా స్నేహితులు ఘాటుగానే విమర్శించారు.

"మీరు చదువు చెప్పినంత మాత్రాన ఆ పిల్లేదో చదివేస్తుందనుకోకండి! పదమూడేళ్ళ పిల్ల, ఏడో తరగతి చదువుతుంది. ఎంత మంది బాయ్ ఫ్రెండ్స్ ని మార్చి వుంటుందో తెలుసా? ఏ మాత్రమూ నిలకడ లేని మనుషులు! వాళ్ళకోసం ప్రభుత్వం మిలియన్ల దలర్లు ఖర్చు చేస్తుందని కూడా తెలుసుకోరు!". అంటూ.

ఎవరికీ ఏ సమాధానమూ చెప్పకుండా కే అడ్రసు పట్టుకొని కారెక్కింది తను, ఒక ఆదివారం.

అలా అయిదేళ్ళుగా జెన్నీ కి చదువు చెప్తూ, భవిష్యత్తు మీద ఆశలు కల్పిస్తూ, ప్రపంచం గురించి చెప్తూ, గడుపుకొచ్చింది. దుర్భరమైన దారిద్ర్యంలో, నిరాశలతో కృంగిపోతూ కూడా బిడ్డని ఒక మెట్టెక్కించాలన్న కే తాపత్రయం అర్థమైనా, పద్మకి అర్థం కాని ఒకే ఒక్క విషయం మైఖెల్ ప్రవర్తన.

ఇరవై యేళ్ళ మైకేల్ యే ఉద్యోగ ప్రయత్నం చేయకపోగా, తల్లినీ చెల్లినీ వేధించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడా అనిపిస్తుంది చూసే వారికి. ఎలాగైనా అతనికి కొంచెం బాధ్యత మప్పాలనీ, చుట్టూ వున్న మనుషులని ప్రేమించడం నేర్పాలనీ పద్మ అతన్ని వెల్ఫేర్ సెంటర్ కి లాక్కెళ్ళి రకరకాల వ్యాపకాల్లో చేర్పించడానికి ప్రయత్నిస్తూనే వుంది. అతను మొండిగా ప్రతిఘటిస్తూనే వున్నాడు. అతని మానసిక స్థితి అర్థం చేసుకోవడానికి అబోరిజీన్ల చరిత్ర గురించి శ్రద్ధగా చదివింది పద్మ.

పంతొమ్మిది వందల అరవైలలో కే ని ఆమె తల్లి నుంచి అపహరించి ఒక ఫోస్టర్ హోం లో వుంచింది ప్రభుత్వం. అబొరిజీన్ తల్లులకీ శ్వేత జాతీయులకీ పుట్టిన సంతానాన్ని చాలా వరకు అలా అపహరించారు. తల్లి నుంచి వేరయిపోయిన కే ఎక్కడెక్కడో తిరిగి, ఎక్కడెక్కడో పెరిగి చివరికి ఇలా మర్రే బ్రిడ్జి చేరుకుంది. తమ జాతి మీద యూరోపియన్లు సాగించిన దౌర్జన్యానికి తలచుకుని అందరు యువకుల్లాగే కోపంతో ఉడికిపోతూ వుంటాడు మైఖెల్. ప్రభుత్వం అబోరిజీన్ల జాతికి సమర్పించిన క్షమాపణలూ, వారి కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలూ అన్నీ కంటి తుడుపుగా మొసలి కన్నీటిలా అనిపిస్తుందతనకి.

కానీ, చెదిరిపోయిన జీవితాన్నీ, జాతి చరిత్రనూ తిరిగి ఎలా సాధించుకోవాలో అర్థం కూడా కాదు. తమ మాతృభాష మరచిపోయిందని తల్లి మీద మండి పడతాడు. ఇంగ్లీషు మాట్లాడితే నొచ్చుకునే స్వాభిమానం! కనబడని శతృవుల పైన కసితో, గెలవలేని యుద్ధం చేస్తూ, జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్న మైఖెల్ లాటి యువకులని చూస్తే జాలి తప్ప వేరే భావన రాదు పద్మకి. "వాళ్ళ కోసం నీ సమయాన్నీ శక్తినీ ఎందుకు వృథా చేస్తావు," అని అడుగుతూనే వుంటారు కృష్ణా, రాబర్ట్.

"అమ్మా! ఇవాళ నేనొచ్చేసరికి ఆలస్యం కావొచ్చు. కొంచెం బయటికెళ్ళే పని వుంది!"

"ఈ స్థితిలో కూడా ఆఫీసుకెందుకే?"

"ఆఫీసుక్కాదమ్మా! ఒకళ్ళ ఇంటికి!"

"నిండా నీళ్ళాడ పొద్దు రోజులు. ఇప్పుడు కారు తీసుకొని వెళ్ళడం ఎందుకే? ఎండ కూడా ఎక్కువతోంది. ఇంటి పట్టున వుండు, నా మాట విని."

"అదీ, అలా చెప్పండి అత్తయ్యా! నేను ఎంత చెప్పి వుంటాను? వూరికే అంతంత డ్రైవు చేస్తూ ఆ అబోరిజీన్ల ఇళ్ళకి వెళ్ళొద్దని! వాళ్ళసలే," ఇంకా ఏదో అనబోయి పద్మ మొఖం చూసి ఆపేసాడు కృష్ణ.

"ఈ ఒక్క సారికే అమ్మా. జెన్నీ కి పరీక్షలైపోయాయి కదా! ఎలా వుందో ఒక్క సారి చూసొస్తా. వాళ్ళ దగ్గర ఫోన్ లేదు. తర్వాత డెలివరీ అయ్యేంతవరకూ ఇల్లు కదలను సరేనా?"

"పోనీ, నేనూ రానా నీతో?" ఉత్సాహంగా అడిగింది రుక్మిణి.

"సరిపోయింది! మీరింకా తనని ఆపుతారనుకుంటే మీరు కూడానా?" విసుక్కున్నాడు కృష్ణ.

అరగంటలో తల్లీ కూతుళ్ళిద్దరూ కారులో వున్నారు.

"హాయ్ పేట్! పరీక్షలు బాగా రాసాను. అయాం గోయింగ్ టు బీ ఏ నర్స్!" కారు చప్పుడుకి ఉత్సాహంగా పరిగెత్తుకొచ్చిన జెన్నీ, కొత్త వ్యక్తిని చూసి బిడియంగా ఆగిపోయింది.

"జెన్నీ! ఈవిడెవరో తెలుసా? మా అమ్మ! అమ్మా, తనే జెన్నీ అంటే!" పరిచయం చేసి ఆపసోపాలు పడుతూ మెట్లెక్కింది పద్మ. వరండాలోంచే వాళ్ళని చూసి పారిపోయాడు మైఖెల్.

"మైఖెల్, ఇలా రా! ఇదిగో మా అమ్మ! మీ అమ్మ లాగే మహా నస!" పిలిచింది పద్మ.

"ఇవాళ మీకోసం కేక్ తెచ్చాను. మైఖెల్, ఎప్పుడైనా సెంటర్ కి వెళ్ళి రాబర్ట్ ని కలిసావా? నేనాఫీసుకెళ్ళి వారం రోజులైంది," పరాయి ఇంట్లో చనువుగా తిరుగుతున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూసింది తల్లి.

ఎన్నడూ లేంది వాళ్ళిద్దరికీ చెరో గ్లాసులో జ్యూస్ తెచ్చి ఇచ్చాడు మైఖెల్. ఎత్తుగా వున్న పద్మ పొట్ట చూపిస్తూ, "ఇలాటి పరిస్థితిలో, ఇంత ఎండలో ఎందుకు,,?" అని ఆగిపోయాడు. సిగ్గుతో ఎర్రబడ్డ అతని మొహం చూసి నవ్వుతూ ఆగిపోయింది పద్మ.

వున్నట్టుండి "అమ్మా!" అంటూ కూలబడింది.

"ఏమయిందే, అంతలోనే ఏమయిందమ్మా?"

"నొప్పి! హాస్పిటల్ కెళ్ళాలేమో," పళ్ళ బిగువున అంది పద్మ.

"అమ్మో! ఇప్పుడెలా? ఇక్కడ హాస్పిటల్ వుంటుందా?" గాభరాగా అంది రుక్మిణి.

"ఆగు, నువ్వు కంగారు పడకు. పిల్లలు భయపడతారు. నా ఫోన్ లో ఒక నంబరుంటుంది, జెన్నీ కిచ్చి ఆ నెంబరుకి చేయమను."

వున్నట్టుండి మారిపోయిన పరిస్థితికి జెన్నీ కాళ్ళూ చేతులు వొణకడం మొదలైంది.

"జెన్నీ, భయపడకు. ఆ నెంబరుకి ఫోన్ చేయి. వాళ్ళొచ్చి నన్ను ఆస్పత్రికి తీసికెళ్తారు."

జెన్నీ భయం చూసి మైఖెల్ ఫోన్ అందుకున్నాడు.

"డోంట్ వరీ పాట్. ఆస్పత్రి కి నేను తీసికెళతా. ఇక్కడికి దగ్గరే. కమాన్!"

కారు వాకిట్లోకి తెచ్చి, మెల్లిగా పద్మని కారులోకి చేర్చాడు మైఖెల్. భయంతో వొణికిపోతున్న చెల్లినీ, రుక్మిణినీ ఓదారుస్తూనే, పద్మకి సీటు బెల్టు పెట్టీ హాస్పిటల్ చేర్చాడు.

నాలుగు గంటల తరవాత,

"పద్మా! ఒక్కసారి కళ్ళు తెరిచి నీ బంగారు బొమ్మని చూసుకో!" తల్లి గొంతులో ఉరకలేస్తున్న ఉత్సాహానికి కళ్ళు తెరిచింది పద్మ. పడ్డ నొప్పులుకానీ, బయట పడ్డ బిడ్డ కానీ ఏదీ గుర్తు రాని ఒక మహా ప్రశాంతత.

"కృష్ణ ఏడీ?"

"ఇప్పుడే ఎవరో ఫోన్ చేస్తే బయటికి వెళ్ళాడు. ఆ అబ్బాయి మైఖెల్ ఎంత బుద్ధి మంతుడే, నిజంగా! నిన్ను హాస్పిటల్ చేర్చి, వాళ్ళ అమ్మకి ఫోన్ చేసి, కృష్ణ కి ఫోన్ చేసి, ఎంత బాధ్యతగా ప్రవర్తించాడనుకున్నావ్? పాపం, పిల్ల మాత్రం బెదిరిపోయింది. వాళ్ళమ్మ ఇప్పడి దాకా ఇక్కడే వుండి నీకు తినడానికేమైనా తెస్తానని వెళ్ళింది. ఇదిగో, పాపని నీ పక్కనే పడుకోబెడతున్నా, చూడు."

మెల్లిగా పాప వైపు తిరిగి వెన్నెల కురిసినట్టు నవ్వింది పద్మ.

"నేనొద్దంటూంటే ఇప్పుడీ మర్రే బ్రిడ్జి కొచ్చి," లోపలికొస్తూనే ఇంకా ఏదో అనబోయాడు కృష్ణ.

"నీ కసలు బుద్ధుందా? నీ జీవితంలోకి ఇంకో అద్భుతమైన ఆడపిల్ల వొచ్చిన సందర్భంలో ఈ సోదంతా అవసరమా?" నవ్వు మొహంతో కోపంగా అడిగింది పద్మ. ఆ మొహంలోకి చూస్తూ ఇంకేమీ అనలేకపోయాడు కృష్ణ. అయినా అతనికి కూతురు మొహం చూడడం తప్ప ఇంకే విషయంలోనూ ఆసక్తి లేనట్టనిపిస్తుంది.

వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదిలేసి రుక్మిణి బయటికి వెళ్ళిపోయింది.

"ఆ పిల్లలిద్దరూ నీతో మాట్లాడాలని తహతహలాడుతున్నారు. లోపలికి పిలవనా?"

"అలాగే", నవ్వుతూ తలూపింది.

"జెన్నీ, మైఖెల్, పాట్ పిలుస్తోంది మిమ్మలని." వాళ్ళని లోపలికి పిలిచి కృష్ణ బయటకెళ్ళిపోయాడు.

ఇద్దరూ లోపలికొచ్చారు. పాపాయిని అబ్బురంగా చూసారు.

"ఎంత అందంగా వుంది! పాట్, ఒక్కసారి ముట్టుకోవచ్చా?" బెదురుగా అడిగాడు మైఖెల్.

"తప్పకుండా,"

"ముందు చేతులు శుభ్రం చేసుకో," వెనకగా కే గొంతూ వినిపించింది.

"జెన్నీ పెద్ద నర్సవుతానంది కానీ ఎలా భయపడిందో చూడు," మైఖెల్ వెటకారం చేసాడు.

"నర్సింగ్ చదువు పూర్తయేసరికి భయాలన్నీ పోతాయి," ధైర్యంగా అంది జెన్నీ.

"పాట్! నా పిల్లలకోసం ఇంత శ్రద్ధగా, ఇంత నమ్మకంగా, నువ్వు, నీకేదైనా అయితే..." ఆ పైన మాట్లాడలేకపోయింది కే.

మొరటుగా ఉక్రోషంగా వుండే మైఖెల్ కళ్ళల్లో నీళ్ళు.

అందరూ వెళ్ళిపోయిన తరవాత మళ్ళీ వెనకగా వచ్చాడు మైఖెల్

"అయాం సారీ! ప్రపంచంలో అందరూ చెడ్డవాళ్ళేననీ, మామీద జాలి చూపించే వాళ్ళు మా వెనకగా నవ్వుకుంటారనీ అనే అనుకున్నాను. నేనూ వచ్చే సంవత్సరం ఏదైనా ట్రెయినింగ్ కి వెళ్తాను." అతను చెప్పాలనుకుని చెప్పలేకపోయిన మాటలన్నీ విన్నదామె.

"నా బాగులో నీకోసం తెచ్చిన బ్రోచర్ వుంది. ముందు ఆ ఫారం నింపి రేపు కనిపించు," అభావంగా అంది.

ఎప్పుడూ చూడని నవ్వు మైఖెల్ మొహం మీద, దాదాపు పాప అంత అందంగా వుంది.

COMMENTS